ప్రభుత్వ భూములను పరిరక్షించాలి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీశ్

నిజాంపేట్: ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూడాలని కోరుతూ నిజాంపేట్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీశ్ మేడ్చల్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహదూర్‌పల్లి సర్వే నంబర్ 227/1, అదేవిధంగా నిజాంపేట్ సర్వే నంబర్ 233/2లోని శ్మశాన వాటిక స్థలాల కబ్జాలపై అధికారులు హైకోర్టుకు అప్పీలు చేసి కాపాడాలన్నారు. స్థానిక రెవెన్యూ అధికారుల ఉదాసీనత వల్లే కబ్జాలు జరుగుతున్నాయని ప్రభుత్వ భూమిలో 1000 గజాలు కబ్జా పెట్టిన కాంగ్రెస్ కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.

వాటర్‌వర్క్స్ కార్యాలయంలో..

చింతల్: సమస్యలు పరిష్కరించాలని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి కోరారు. ఈమేరకు ఆయా సంక్షేమ సంఘాల నేతలతో కలిసి కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో జీఎం అశోక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో మిగిలిన చిన్న చిన్న పనులు కూడా కొన్ని నెలలుగా పూర్తి చేయడం లేదన్నారు. అలాగే ఆయా బస్తీలు, కాలనీల నుంచి కూడా పలు ఫిర్యాదులు వచ్చాయి. గాజులరామారం సెక్షన్ పరిధిలోని షిర్డీ హిల్స్, కైలాశ్ హిల్స్, బాలయ్య బస్తీల నుంచి నూతన భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు వేయాలని, షాపూర్‌నగర్ సెక్షన్ సంజయ్‌గాంధీనగర్‌లో మురుగు నీరు రోడ్లపై పారుతోందని, సుచిత్ర, జగద్గిరిగుట్ట, చింతల్ సెక్షన్ల నుంచి భూగర్భ డ్రైనేజీ నూతన పైపులైన్లను ఆధునీకరించాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులను త్వరలోనే పరిష్కరిస్తామని జీఎం అశోక్ హామీనిచ్చారు. డీజీఎంలు, సెక్షన్ మేనేజర్లు, ఎలక్ట్రికల్ మేనేజర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో వినతిపత్రం..

కుత్బుల్లాపూర్: ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని అరికట్టడంలో అధికారులు ఏం చర్యలు తీసుకుంటున్నారో ఆర్టీఏ చట్టం కింద తెలపాలని కోరుతూ పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఉపకమిషనర్ నరసింహకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫంక్షన్ హాళ్లు, హోటళ్లు, ఆలయాల్లో సైతం నాసిరకం ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ కప్పులు వాడుతున్నారన్నారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్లు ఏసురత్నం తదితరులు ఉన్నారు.



జీఎం అశోక్‌కు ఫిర్యాదు చేస్తున్న శేషగిరి తదితరులు

కార్మికుల వేతనాలు పెంచాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

జీడిమెట్ల: దీపక్‌నైట్రేట్ పరిశ్రమ యూనిట్–2 యాజమాన్యం వెంటనే కార్మికుల వేతనాలు పెంచాలని కుత్బుల్లాపూర్ మండల సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్, మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ రైతుబజార్ నుంచి పరిశ్రమ వరకు సోమవారం కార్మికులతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాలు పెంచాలని ఇప్పటికే పరిశ్రమ జనరల్ మేనేజర్‌కు డిమాండ్ నోటీసు ఇచ్చినా స్పందన లేపోగా కార్మికులకు రావాల్సిన ఇతర ఇన్సెంటివ్‌లను సైతం నిలిపివేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా మొండి వైఖరి వీడి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు పసుపుల అంజయ్య, దేవదానం, రావుల స్వాతి, ప్రసాద్, శ్రీను, ఖలీల్, షఫీ, వినయ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



విద్యార్థులతో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, కరస్పాండెంట్



సైన్స్ నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి

రంగారెడ్డినగర్: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి అన్నారు. రంగారెడ్డినగర్‌లోని బ్రైట్ కాన్సెప్ట్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన (స్టూడెంట్స్ లీడ్ కాన్ఫరెన్స్) వైజ్ఞానిక ప్రదర్శనను కరస్పాండెంట్ డాక్టర్ వినోద్ కుమార్ జాదవ్, ట్రస్మా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. వినోద్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అనుభవజ్ఞులైన టీచర్లతో బోధిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన నమూనాలను కరస్పాండెంట్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తిలకించి ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రశంసించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షుడు బిర్రు ఆంజనేయులు, ట్రస్మా ప్రతినిధులు గడ్డమీది బాలరాజు, శ్యామ్, భూపాల్ రెడ్డి, నరసింహులు, దయాకర్, చెప్యాల నరసింహులు గౌడ్, మధు, ఇమ్రాన్, శ్రీశైలం, లీడ్ సంస్థ కో ఆర్డినేటర్లు మునిచౌదరి, ప్రసన్నకుమార్, పాఠశాల ఇన్‌చార్జి అయేషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఏర్పాటు చేసిన బెంచీలను తొలగించాలి

నిజాంపేట్: రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన బెంచీలను తొలగించాలని కోరుతూ నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కమిషనర్ సాబేర్ అలీకి సోమవారం ఫిర్యాదు చేశారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు మారుతీసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ లాలయ్య, ఉపాధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ.. శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఎదుట ఉన్న లత లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్ వాసులు సేద తీరేందుకు రోడ్డు పక్కనే బెంచీలు ఏర్పాటు చేశారని, దీంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోందన్నారు. ఈ విషయమై పలుమార్లు అపార్ట్‌మెంట్‌వాసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.



అపార్ట్‌మెంట్ ఎదుట ఏర్పాటు చేసిన బెంచీలు



చురుగ్గా కల్వర్టు పనులు

జగద్గిరిగుట్ట: హెచ్ఎంటీ పైప్‌లైన్ రోడ్డులో సుమారు రూ. కోటి నిధులతో చేపట్టిన కల్వర్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటివరకు 50 శాతం వరకు పనులు పూర్తయ్యాయని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఏఈ తిరుపతి తెలిపారు.

గిరినగర్ రోడ్డులో రాళ్లు వేసి గుంతలు పూడుస్తున్న బస్తీ వాసులు



పంచశీల కాలనీలో సీసీకి నోచుకోని రోడ్డు



గాంధీనగర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్ రోడ్డు దుస్థితి



ఆదర్శనగర్ ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో..



తవ్వి.. వదిలేశారు..!

- డ్రైనేజీ లైన్ల నిర్మాణంతో రోడ్ల తవ్వకం
- పనులు పూర్తయిన మరమ్మతులు చేపట్టని వైనం
- నిధులు మంజూరైనా.. పిలవని టెండర్లు
- రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు

రంగారెడ్డినగర్: డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా రోడ్లను తవ్విన అధికారులు తర్వాత మరమ్మతులు చేపట్టకపోవడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్, రంగారెడ్డినగర్, గిరినగర్, ఇందిరాగాంధీనగర్ తదితర ప్రాంతాల్లో మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు జలమండలి ఆధ్వర్యంలో రోడ్లను తవ్వి నూతన భూగర్భ డ్రైనేజీ లైన్లను నిర్మించారు. అయితే పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా మళ్లీ రోడ్లు వేసేందుకు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధ్వంసమైన రోడ్లపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- గిరినగర్‌లో తరచూ డ్రైనేజీ లీకేజీలు ఏర్పడడంతో గత సెప్టెంబర్‌లో జలమండలి అధికారులు కొత్త పైపులైన్ వేసి సమస్యను పరిష్కరించారు. అయితే తర్వాత వరుసగా ఎన్నికల కోడ్ రావడంతో రోడ్డు పనులు ప్రారంభించలేదు. దీంతో స్థానికులే రోడ్డుపై గుంతలను పూడ్చాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- గాంధీనగర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్ రోడ్డులో తవ్విన రోడ్డును పునరుద్ధరించక పోవడంతో ఈ వైపు రాకపోకలు సాగించే వెంకట్రామిరెడ్డినగర్, గాంధీనగర్ వాసులకు అవస్థలు తప్పడం లేదు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులను పలుమార్లు ఫిర్యాదులు చేశామని అయినా పట్టించుకోవడం లేదని సంక్షేమ సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.
- ఇందిరాగాంధీనగర్, రంగారెడ్డినగర్, పంచశీల కాలనీ, మారుతీనగర్‌లోని పలు గల్లీల్లో రోడ్లను మట్టితో పూడ్చారే తప్ప సీసీ వేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత వర్షాకాలంలోనూ బురద రోడ్లపైనే రాకపోకలు సాగించామమని, ఇంకెన్నాళ్లకు పనులు పూర్తి చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఏడాదిగా ఇబ్బందులే..



గిరినగర్ ప్రధాన రోడ్డు ధ్వంసమై ఏడాది కావస్తోంది. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేస్తే నిధులు మంజూరయ్యాని, టెండర్లు పిలవడమే తరువాయి అని పేర్కొంటున్నారు. ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. ప్రతిసారి అధికారులు ఇదే మాట చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో గుంతలను మేమే పూడ్చి రాకపోకలు సాగిస్తున్నాం. మా బస్తీ పక్కనే ఉన్న ఏపీ హెచ్‌బీ కాలనీ, ఆదర్శనగర్‌లో ఇటీవలే రోడ్లు వేశారు. ఇక్కడ కూడా త్వరగా పనులు పూర్తి చేస్తే ఇబ్బందులు తప్పుతాయి.

–ఉదయ్, గిరినగర్ వాసి

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

జీడిమెట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని బీఆర్ఎస్ నాయకుడు గుడిమెట్ల సురేశ్‌రెడ్డి అన్నారు. సాయిబాబానగర్ ప్రభుత్వ పాఠశాలలో మూత్రశాలలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్న ఆయన సోమవారం పాఠశాలను సందర్శించారు. త్వరలోనే టాయిలెట్స్ ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

భూదేవి హిల్స్‌లో ప్రభుత్వ భూముల సర్వే చేపట్టాలి

జగద్గిరిగుట్ట: భూదేవి హిల్స్‌లో ప్రభుత్వ భూముల సర్వే చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ భూమిని తమ భూమి అని చెప్పి ప్లాట్లుగా చేసి సుమరు రూ. 15 నుంచి రూ. 20 లక్షలకు అమ్ముతూ ప్రజలను మోసం చేస్తున్నారని, వెంటనే సర్వే చేపట్టి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. 2018 లో కోర్టు సర్వే చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి వెంటనే సంబంధిత అధికారులను పిలిచి సర్వే చేసి హద్దులు తేల్చాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఉమామహేశ్ తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యుడు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

భవనం పై నుంచి పడి కార్మికుడి మృతి

నిజాంపేట్: నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్ మాల్డాకు చెందిన చందన్‌దాస్ (55) కుటుంబం జీవనోపాధి కోసం వచ్చి బాచుపల్లి సింహపురి కాలనీలోని లేబర్ క్యాంప్‌లో ఉంటున్నారు. కాగా ప్రగతినగర్ కమాన్ సమీపంలో విటాలిటీ ఇంజినీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎవలాన్ విస్టాస్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం పనికి వెళ్లిన చందన్‌దాస్ భవనం పదో అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయం కావడంతో బాచుపల్లిలోని మమత ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం భవనం వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే తన తండ్రి మృతి చెందాడని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కుమార్తె పూజదాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కుత్బుల్లాపూర్ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ సైబర్ క్రైం డీసీపీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైబర్ నేరాలను గుర్తైతే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1930 లేదా సైబర్ క్రైం స్టేషన్ నంబర్ 9490617310 కు ఫిర్యాదు చేయాలని కోరారు. ధ్రువీకరించిన సమాచారాన్ని మాత్రమే ప్రజలు నమ్మాలని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాల బారిన పడకుండా ఉంటామని పేర్కొన్నారు.

మాట వినలేదని మట్టుబెట్టాడు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కే సురేశ్‌కుమార్



రివార్డు అందుకుంటున్న ఎస్ఐ ప్రేమ్‌సాగర్

- వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ
- నిందితుడి అరెస్టు రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీసీపీ సురేశ్‌కుమార్

జీడిమెట్ల: ఈనెల 10న హెచ్ఎంటీ సమీపంలో జరిగిన మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. లైంగిక వాంఛ తీర్చాలని కోరగా తిరస్కరించడంతోనే అంతమొందించాడు. షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ కే సురేశ్‌కుమార్ ఏసీపీ హన్మంతరావు, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. కర్ణాటకకు చెందిన గజ్జల నరేశ్ (31) తల్లి, సోదరుడితో కలిసి బతుకుదెరువు కోసం జీడిమెట్లకు వలస వచ్చారు. మూడేళ్ల క్రితం నరేశ్ తల్లి మృతిచెందగా, సోదరుడు స్వగ్రామానికి వెళ్లాడు. దీంతో నరేశ్ ఇక్కడే కూలీ పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బుతో మద్యం, గంజాయి సేవిస్తూ ఫుట్‌పాత్‌లపై ఉంటున్నాడు. కొన్ని నెలలుగా షాపూర్‌నగర్, చింతల్ ఫుట్‌పాత్‌లపై పద్మ (42) అనే మహిళ సైతం యాచక వృత్తి చేస్తూ అక్కడే జీవిస్తుంది. పద్మ డబ్బుల కోసం సెక్స్ వర్కర్‌గా మారింది. ఈనెల 10న రాత్రి 11గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై పద్మను తీసుకువచ్చి కుత్బుల్లాపూర్ జంక్షన్ ఎదురుగా ఉన్న హెచ్ఎంటీ గేట్ వద్ద వదిలివెళ్లాడు. గమనించిన నరేశ్ పద్మ వద్దకు వెళ్లి తన లైంగిక వాంఛ తీర్చాలని కోరగా నిరాకరించింది.

హత్య చేసైనా..

పద్మను చంపి అయినా లైంగిక వాంఛ తీర్చుకోవాలని నరేశ్ అదును కోసం చూశాడు. అదే రోజు రాత్రి వాహనాల రద్దీ తగ్గిన తర్వాత పెద్ద సిమెంట్ ఇటుక తీసుకుని పద్మ ముఖంపై బాదాడు. అనంతరం ఆమెను 20 అడుగుల దూరం ఈడ్చుకెళ్లాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడ నుంచి కుత్బుల్లాపూర్ చౌరస్తాలో ఉన్న వాహనాల పార్కింగ్ వరకు వెళ్లాడు. అక్కడ రక్తపు మరకలు ఉన్న బట్టలు మార్చుకున్నాడు. మళ్లీ తెల్లవారుజామున 3 గంటలకు హత్య ప్రదేశానికి వెళ్లి పద్మను పరిశీలించగా మృతి చెందడంతో చింతల్‌వైపు పరారయ్యాడు.

సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి గుర్తింపు..

మొదటగా పోలీసులు గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేశారు. స్థానికంగా ఆమె గురించి ఆరా తీయగా పద్మ అని గుర్తించారు. అనంతరం నరేశ్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నరేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ ప్రేమ్‌సాగర్, కానిస్టేబుళ్లు నరేశ్, రవికి డీసీపీ రివార్డులు అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

సర్వే షురూ

- కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలో నమోదు
- డివిజన్‌కు నోడల్ అధికారి నియామకం
- ప్రత్యేక యాప్ ద్వారా సర్వే వివరాల నమోదు



ఇంటి వద్ద సర్వే చేస్తున్న సిబ్బంది

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సర్వే సోమవారం ప్రారంభమయ్యింది. 75 గజాల్లోపు స్థలం ఉన్నవారు అర్హులుగా ఉండడంతో వారి స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు డివిజన్‌కు ఒక నోడల్ అధికారిని నియమించి దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. సోమవారం జరిగిన సర్వేలో ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి పాల్గొన్నారు. గత డిసెంబర్ 28 నుంచి ఈ యేడాది జనవరి 6 వరకు ప్రజా పాలన సభలు నిర్వహించి దరఖాస్తులు తీసుకున్న విషయం తెలిసిందే. మొత్తం 8 డివిజన్లలో 32 బృందాలు నిర్వహించిన సభల్లో అభయ హస్తం కింద 1,48,151 దరఖాస్తులు వచ్చాయి.

అత్యధికంగా సుభాష్‌నగర్..

జంట సర్కిల్ పరిధిలో అత్యధికంగా 25,699 దరఖాస్తులు సుభాష్ నగర్ డివిజన్ నుంచి రాగా, అతి తక్కువగా చింతల్ డివిజన్‌లో 13, 609 దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జగద్గిరిగుట్టలో 18,904, సూరారం 18,127, రంగారెడ్డినగర్ 15,106, జగద్గిరిగుట్ట 23,489, కుత్బుల్లాపూర్ 19,431, జీడిమెట్ల 13,786 కు దరఖాస్తులు వచ్చాయి.

ప్రత్యేక యాప్ ద్వారా సేకరణ..

ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేపడుతున్నారు. 75 గజాల లోపు స్థలం ఉన్నవారికి ఇంటి స్థితిగతులను పరిశీలించి ఇంటి స్థలం ఫొటోతో పాటు, దానికి సంబంధించిన పత్రాలను పరిశీలించి వారి ఆదాయ ఇతరత్రా వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ వివరాలు రాష్ట్ర హౌసింగ్ సంస్థ పీడీలోకి వెళ్తుంది. దీంతో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

సిబ్బందికి సహకరించాలి..



ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు వచ్చే అధికారులకు దరఖాస్తుదారులు సహకరించి పూర్తి వివరాలు ఇవ్వాలి. ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్, ఇతరత్రా వివరాలను దగ్గర ఉంచుకోవాలి.

–మల్లారెడ్డి, ఉప కమిషనర్ గాజులరామారం

త్వరలోనే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

నిజాంపేట్: ఇందిరమ్మ కాలనీలో అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని త్వరలోనే ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విగ్రహానికి దళిత సంఘం నాయకుడు మేకల నగేశ్ విరాళం అందజేయగా సోమవారం అంబేడ్కర్ విగ్రహాన్ని దిమ్మెపై ఏర్పాటు చేశారు.

